# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# రైతు 'బంధు' రహస్యం

**అయితే** బుకాయింపు, కాదంటే దబాయింపు.. కాంగ్రెస్‌కు తెలిసినవి ఈ రెండే విద్యలు. రైతుబంధు విషయంలో రెండింటినీ మార్చి మార్చి ఉపయోగిస్తున్న రాష్ట్ర సర్కారు చివరికి ఇరికి ఇగిలించే పరిస్థితి వచ్చింది. పూటకోమాటతో దాటవేస్తున్న కాంగ్రెస్‌కు కేసీఆర్ అదిలింపుతో గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయింది. 'బిడ్డా నీ సంగతి జూస్తా' అని కేసీఆర్ తాఖీదు ఇస్తే దెబ్బకు దెయ్యం వదిలింది. ఓటమి భయంతో లబ్ధిదారుల ఖాతాల్లో హడావుడిగా డబ్బులు వేసింది. ఐదెకరాలకే పరిమితం చేయాలనే ఆలోచన సర్కారుకు ఉన్నా తప్పనిసరి పరిస్థితిలో అందరికీ అందజేసింది. ఇది ఏ రకంగా చూసినా కేసీఆర్ విజయమే. తెలంగాణ రైతాంగానికి అండగా నిలబడేది కేసీఆర్ మాత్రమేనని మరోసారి రుజువైన సందర్భమిది. నిజానికి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే రైతుబంధు కోసం కేసీఆర్ నిధులు కేటాయించారు. ఇక పంపిణీ చేయడమే తరువాయి అన్న దశలో కాంగ్రెస్ సైంధవునిలా అడ్డుపడింది. ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించి మరీ రైతుబంధును ఆపించింది. ఎన్నికల్లో గద్దెనెక్కిన తర్వాత అలవాటుగా అసలు విషయం మరిచింది. డిసెంబర్‌లో పడాల్సిన డబ్బులు యాసంగి సీజన్ ముగిసిన తర్వాత మే నెలలో వేసి ఏదో ఘనకార్యం సాధించినట్టు కాంగ్రెస్ పోజులు కొడుతున్నది. ఈ పరిణామం వెనుక మనకు రెండు కారణాలు కనిపిస్తాయి. ఆనాడు ఆపించింది కేసీఆర్‌కు ఎక్కడ పేరు వస్తుందోననే భయం వల్ల అని. ఇప్పుడు వేసింది కూడా కేసీఆర్ చేసిన హెచ్చరికల దడుపు వల్ల!

రాష్ట్ర సాధకుడిగా, సమగ్ర అభివృద్ధి సారథిగా కేసీఆర్ నిర్వహించిన పాత్ర ఎవరూ కాదనలేనిది. అధికారం కోసం బూటకపు హామీలిచ్చిన చరిత్ర కేసీఆర్‌కు ఎన్నడూ లేదు. చెప్పినవీ, చెప్పనివీ చేసి చూపిన దార్శనికునిగా, రాజకీయ ప్రతికూలతలను తట్టుకుని నిలబడ్డ యోధునిగా ఆయనకు పేరుంది. అలాంటి కేసీఆర్ పట్ల కాంగ్రెస్ అక్కసు పెంచుకుంది. రాష్ట్ర సాధన ఉద్యమంలో రెండు ముఖాలతో ఆ పార్టీ నడిపిన అవకాశవాద రాజకీయాన్ని ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ముసలి కాంగ్రెస్‌ను ఛీ కొట్టి మూలకు పడేశారు. ఒకటికి రెండుసార్లు కేసీఆర్‌కు అధికారం అప్పజెప్పి తెలంగాణకు అసలైన కాపలా ఎవరో సూటిగా, సుత్తి లేకుండానే చెప్పారు. అందుకే కేసీఆర్ అంటే కాంగ్రెస్‌కు మంట. ముఖాముఖి పోటీలో కేసీఆర్‌ను గెలవడం కల్ల అని కాంగ్రెస్‌కు తెలుసు. నేరుగా ఎదుర్కోవడం సాధ్యం కాదు కనుకనే మాయోపాయంతో, జిత్తులమారి హామీలతో ఓటర్లను ఊదరగొట్టి ఏమార్చింది. హామీలను నమ్మరేమో అనే అపనమ్మకంతో వాటికి గ్యారెంటీలంటూ తొడుగులు తగిలించింది. బాండ్ల ముసుగు వేసింది. కాంగ్రెస్ నేతలు అసాధ్యమైన హామీలతో అరచేతిలో స్వర్గం చూపించారు. అధికారం హస్తగతం చేసుకున్నారు. ఫలితం మరోసారి తెలంగాణ విధ్వంసం. సాగుతో సహా సమస్త రంగాలు సంక్షోభంలోకి జారుకుంటున్నాయి. దేశానికే అభివృద్ధి నమూనాగా నిలిచిన సరికొత్త రాష్ట్రం కాంగ్రెస్ నిర్వాకం వల్ల అట్టడుగుకు పడిపోతున్నది. మూడునాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలన అంటే ఏమిటో ప్రజలకు అర్థమైపోయింది. హామీల అమలు కాంగ్రెస్ సర్కారుకు గుదిబండగా మారింది. ఇందులో అన్నిటికన్నా ఎక్కువగా చెప్పుకోగలిగింది రైతుబంధు గురించి. 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరాకు ఏటా పదివేల రూపాయలిస్తే.. మేం రైతు భరోసాగా పేరు మార్చి పదిహేను వేలిస్తాం' అని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. పెంచుడు మాట దేవుడెరుగు, అంతకు ముందున్నది ఇస్తే అదే పదివేలన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.

ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో కేసీఆర్ దూసుకుపోతున్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పడుతున్నారు. తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. కాంగ్రెస్ తమను నిలువునా ముంచిందని మొరపెట్టుకుంటున్నారు. తెలంగాణ గోస తెలిసిన పెద్ద దిక్కు అయిన కేసీఆర్ వారికి భయం లేదని భరోసా ఇస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అప్పజెప్పిన విపక్ష పాత్రను సమర్థంగా పోషించి, సమస్యలపై గిరిగీసి కొట్లాడతానని తెగేసి చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే అన్యాయాలకు ప్రజల తరఫున పంజు (పెద్ద మనిషి)గా నిలిచి కొట్లాడుతానని మాట ఇస్తున్నారు. ఈ మాటలకు ప్రజల నుంచి లభిస్తున్న ఆత్మీయ స్పందన చూసి కాంగ్రెస్ గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. నానా కుట్రలు పన్ని కేసీఆర్ ప్రచారానికి 48 గంటలు బ్రేక్ వేయించడమే అందుకు నిదర్శనం. కేసీఆర్ గొంతు నొక్కితే గానీ తాము గెలవలేమనేది బహుశా వారి ఉద్దేశమేమో. కానీ, నిషేధం ముగిసిన తర్వాత కేసీఆర్ రెట్టించిన ఉత్సాహంతో ప్రజల మధ్యకు వెళ్లారు. 'మీ సమస్యల మీద నేను సర్కారును నిలదీస్తా' అని మాటిచ్చారు. 'రైతుబంధు ఎట్ల వేయరో చూస్తా' అని అన్నదాతల తరఫున గొంతెత్తారు. ఆయన చర్నకోల ఛెళ్లు మనిపించిన తర్వాతే కాంగ్రెస్ దిక్కు లేక దిగి వచ్చిందన్నది నూరు శాతం వాస్తవం. కండ్ల ముందు కనిపించే సత్యం. అయితే రైతుబంధు విషయంలో కాంగ్రెస్ మరోసారి తన సంకుచితత్వాన్ని బయటపెట్టుకున్నది. ఎన్నికల్లో ఓట్ల కోసం వేస్తున్నట్టే చేసి, దొడ్డిదారిన ఈసీని ఆశ్రయించి మళ్లీ ఆపేయించింది. అసెంబ్లీ ఎన్నికలప్పటి నాటకాన్ని మళ్లీ రక్తి కట్టించింది. ఇదీ ఆ పార్టీ చిత్తశుద్ధి.

కాంగ్రెస్‌కున్న తెలంగాణ సోయి ఏపాటిదో జనానికి తెలియందికాదు. అభివృద్ధి సంక్షేమాల అమలులో ఆ పార్టీ పనితీరు పెద్ద రహస్యమేమీ కాదు. అమలు సాధ్యం కాని అడ్డగోలు హామీలతో అధికారంలోకి రావడం, ఆపై మాటతప్పడం కాంగ్రెస్‌కు అలవాటే. ఇచ్చిన 'నిరుద్యోగ భృతి' హామీ ఇవ్వనేలేదని ఉపముఖ్యమంత్రి భట్టి బొంకినా, ఇవ్వని 2500 రూపాయలను మహిళలకు ఇస్తున్నట్టు రాహుల్‌గాంధీ అబద్ధమాడినా అవి ఈ కోవలోనివే. అర్ధసత్యాలు, అసత్యాలతో కాలయాపన వారి నైజం. మంది బిడ్డలను తన బిడ్డలుగా చెప్పుకొని ముద్దాడటం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అని కేసీఆర్ ఎప్పుడూ అంటుంటారు. పథకం తెచ్చింది కేసీఆర్. నిధులు సమకూర్చిందీ కేసీఆరే. చివరకు కేసీఆరే రంగంలోకి దిగి గూబ గుయ్యిమనిపిస్తే గానీ కాంగ్రెస్ కండ్లు తెరవలేదు. అయినా సీఎం రేవంత్ మేకపోతు గాంభీర్యంతో మాట్లాడుతున్నారు. ఆకాశాన్ని నేలకు దించినట్టు గొప్పలకు పోతున్నారు. 'రైతుబంధు ఇచ్చాం.. కేసీఆర్ ముక్కు నేలకు రాస్తాడా' అంటూ అర్థంపర్థం లేని వాగాడంబరం ప్రదర్శిస్తున్నారు. కానీ, ఇక్కడ ఉన్నది కేసీఆర్. రాష్ట్ర వ్యవసాయ స్వరూపాన్నే మార్చి అధిక దిగుబడులతో దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన కేసీఆర్ ముందు కాంగ్రెస్ వేసే కుప్పిగంతులు నిలబడజాలవు. ప్రభుత్వ వైఫల్యాల మీద నుంచి దృష్టి మళ్లించేందుకు కాంగ్రెస్ వేస్తున్న చిల్లర వేషాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. మోసపోయి గోసలు పడుతున్న ఆ ప్రజలే రేపటి ఎన్నికల్లో రేవంత్ ముక్కు నేలకు రాయించడం తథ్యం!

## మోదీ కోడ్ ఆఫ్ కండక్ట్

**విద్వేషపూరిత ప్రసంగాలతో అణగారిన వర్గాలకు చెందిన హిందువులు, ముస్లింలను బీజేపీ నేతలు భయపెడుతున్నారు. ఎన్నికల ప్రచారాల్లో బీజేపీ నాయకుల విద్వేష ప్రసంగాల కారణంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కాస్త మోదీ కోడ్ ఆఫ్ కండక్ట్‌గా మారిపోయింది. అయినా ఎన్నికల కమిషన్ స్పందించడం లేదు. వారిపై చర్యలు తీసుకోవడం లేదు.**

**- మమతా బెనర్జీ,** పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి


# లౌకికతత్వాన్ని విచ్ఛిన్నం చేస్తున్నదెవరు?

సంఘ్ పరివారం వారు సృష్టిస్తున్న మెసేజ్‌లను క్రాస్ చెక్ చేసుకోకుండా ఫార్వార్డ్ చేయడం ఈ మధ్యకాలంలో ఎక్కువైంది. ఇటువంటి మెసేజ్‌లు అన్ని వాట్సాప్ గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. ఈ మెసేజ్‌లన్నీ కూడా దేశ లౌకికతత్వాన్ని విచ్ఛిన్నం చేసే భావజాలాన్ని ప్రచారం చేసేవే. ఇటీవల అట్లా ప్రచారంలోకి వచ్చిన మెసేజ్ ఒకటి ఇట్లా ఉంది. అదేమిటంటే.. 'హిందూ, ముస్లిం పేరుతో బీజేపీ రాజకీయం చేస్తున్నదని అనేవారు.. 1947కు ముందు బీజేపీ లేదు. మరి హిందూ, ముస్లిం పేరిట దేశాన్ని రెండుగా విభజించింది ఎవరు?'

'ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశ సంపదను ముస్లింలకు పంచి పెడుతుంది. హిందూ స్త్రీల మెడలో ఉన్న మంగళసూత్రాలు కూడా ఎత్తుకుపోతారు. దేశంలో షరియా చట్టాన్ని అమలు చేస్తారు' అంటూ ఎన్నికల ప్రచార సభల్లో దేశ ప్రధాని నరేంద్ర మోదీ విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్న సమయంలో వాట్సాప్ యూనివర్సిటీ నుంచి ఇటువంటి వాట్సాప్ మెసేజ్‌లు విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. అసలు దేశాన్ని మత ప్రాతిపదికన విభజించింది ఎవరు? విచ్ఛిన్నం దిశగా తీసుకెళ్తున్నదెవరు? నిగ్గు తేల్చవలసిన ప్రశ్నలు ఇవి.



శ్రీధర్‌రావ్ దేశ్‌పాండే



**1857** నుంచి 1947 వరకు భారత జాతీయోద్యమ చరిత్రను పరిశీలిస్తే.. 1857లో సిపాయిల తిరుగుబాటు పేరుతో చరిత్రలో లిఖితమైన ప్రథమ భారత స్వాతంత్ర్యోద్యమం అనంతరం భారత జాతీయోద్యమం అనేక మలుపులు తిరుగుతూ సాగిందని అర్థమవుతుంది. 1857లో హిందూ, ముస్లింల ఐక్యత బలంగా ఉండి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని దాదాపు ఓడించినంత పని చేసింది. హైదరాబాద్‌లాంటి కొన్ని పెద్ద, సంపన్న రాజ్యాలు ఈ ఉద్యమంలో పాల్గొనకుండా బ్రిటిష్ వారికి సహకారం అందించినందు వల్ల అంతిమంగా సిపాయిల తిరుగుబాటు అణచివేతకు గురైంది. ఈ ఉద్యమానికి ప్రతీకాత్మకంగా నాయకత్వం వహించిన చివరి మొఘల్ చక్రవర్తి, 80 ఏండ్ల వృద్ధుడు బహదూర్ షా జఫర్‌ను అరెస్టు చేసి రంగూన్ జైలుకు ప్రవాసం పంపించింది బ్రిటిష్ ప్రభుత్వం. ఒంటరి కారాగారవాసం అనుభవిస్తూ బహదూర్ షా జఫర్ 1862లో కన్నుమూశారు. హిందూ, ముస్లింల ఐక్యత కొనసాగితే ఈ దేశంలో అధికారం చలాయించడం సాధ్యం కాదని బ్రిటిష్ వారికి ఆ సిపాయిల తిరుగుబాటు ద్వారా అర్థమైంది. ఇక విభజించి- పాలించు అన్న పాలసీని రూపొందించి అమలు చేశారు బ్రిటిష్ పాలకులు.

సిపాయిల తిరుగుబాటు అనంతరం రాజ్యాలను ఆక్రమించే విధానానికి స్వస్తి పలికి భారతదేశంలో హైదరాబాద్, కశ్మీర్, మైసూర్, జునాగఢ్ లాంటి బలమైన రాజ్యాలను, ఇతర చిన్నచిన్న రాచరిక సంస్థానాలను బ్రిటిష్ అత్యున్నత అధికారానికి (British Paramount Authority) లొంగి ఉండే స్వతంత్ర రాజ్యాలుగా కొనసాగనిచ్చారు. అట్లా బ్రిటిష్ వారి ప్రత్యక్ష పరిపాలనలో ఉన్న భూభాగాలతో సహా సుమారు 560 స్వతంత్ర రాచరిక సంస్థానాలు కూడా 1947 నాటికి ఉనికిలో ఉన్నాయి. అందులో ముస్లిం రాజులు ఉన్నారు, హిందూ రాజులు ఉన్నారు. హిందూ మెజారిటీ కలిగిన హైదరాబాద్ రాజ్యంలో పరిపాలకుడు ముస్లిం. ముస్లిం మెజారిటీ కలిగిన కశ్మీర్‌లో పరిపాలకుడు హిందూ. ఎవరు రాజైనా అందరూ నిరంకుశంగా ఉన్నారు, ప్రజలను పీడించుకుతిన్న వారే. రాచరికమే నిరంకుశమైనది. 20వ శతాబ్దం తొలి నాటికే హిందూ, ముస్లింల మధ్య చీలికలకు, విభేదాలకు బీజాలు పడ్డాయి. ఆ నాటికి బ్రిటిష్ వారు కలకత్తా రాజధానిగా పరిపాలన సాగిస్తున్నారు. 1905లో బెంగాల్ రాష్ట్రాన్ని మత ప్రాతిపదికన విభజించారు. ముస్లింలు మెజారిటీగా (ప్రస్తుత బంగ్లాదేశ్) ఉన్న ప్రాంతాన్ని తూర్పు బెంగాల్ పేరిట ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఢాకాలో వారి ప్రోత్సాహంతోనే 1906లో అఖిల భారత ముస్లిం లీగ్ ఏర్పాటైంది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు చెలరేగాయి. ఆ ఉద్యమానికి జడిసి బ్రిటిష్ ప్రభుత్వం విభజన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నా విభజనకు అనుకూలంగా ముస్లింలను కూడగట్టడాన్ని అప్పటికే ఏర్పాటైన ముస్లిం లీగ్ ప్రారంభించింది. తద్వారా బెంగాల్ ప్రాంతంలో హిందూ, ముస్లింల మధ్య మత కలహాలకు ఆజ్యం పోసింది బ్రిటిష్ ప్రభుత్వం.

**1916లో బనారస్ హిందూ యూనివర్సిటీ ఏర్పాటైంది. దానికి ప్రతిగా అప్పటివరకు ఒక కాలేజీగా ఉన్న మొహమ్మదన్ ఆంగ్లో ఓరియంటల్ కాలేజీ 1921లో ఆలీగఢ్ ముస్లిం యూనివర్సిటీగా రూపం మార్చుకున్నది. ఈ రెండు యూనివర్సిటీలు ఏర్పాటు కావడానికి బ్రిటిష్ ప్రభుత్వం సహకారం అందించింది. ఈ రెండు వర్గాల మధ్య ఐక్యత భగ్నం కావడమే వారికి కావాల్సింది.**

మహారాష్ట్రలో 'స్వాతంత్ర్యం నా జన్మ హక్కు' నినాదంతో జాతీయోద్యమాన్ని తిలక్ ప్రారంభించారు. జాతీయోద్యమంలోకి ప్రజలను సమీకరించడానికి గణేష్ నవరాత్రులను సామూహిక ఉత్సవాలుగా జరపడం ప్రారంభించారు. అయితే తిలక్ కట్టర్ హిందూ జాతీయవాది కాదు. అన్ని వర్గాల ప్రజలు జాతీయ ఉద్యమంలో భాగం కావాలని ఆయన కోరుకున్నారు. 'ఎక్కడ నుంచి వచ్చిన వారైనా, ఏ మతం వారైనా ఈ దేశం బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తం కావడానికి సహకరించే వారందరూ దేశ భక్తులే, భారతీయులే' అని తిలక్ అన్నారు. ఆయన ఉదారవాద వైఖరి సావర్కర్ లాంటి హిందూ జాతీయవాదులకు నచ్చలేదు. అరెస్ట్ అయి అండమాన్ జైలులో ఉన్న సావర్కర్ మెర్సీ పిటిషన్ పెట్టారు. ఇక ముందు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఏ కార్యక్రమాల్లో పాల్గొననని హామీ ఇచ్చి, అండమాన్ జైలు నుంచి విడుదలయ్యారు. విడుదల తర్వాత సావర్కర్ ఆ హామీని నిలబెట్టుకున్నారు. జాతీయోద్యమంలో పాల్గొనకుండా 1915లో హిందూ మహాసభను ఏర్పాటు చేసి, హిందూ జాతీయవాదాన్ని ప్రచారం చేయసాగారు. 'హిందువులు తప్ప మరెవరూ ఈ దేశ పౌరులు కాజాలరు' అన్న హిందుత్వ సిద్ధాంతాన్ని ఆయన ప్రచారంలోకి తీసుకువచ్చారు. Essentials of Hindutwa అన్న పుస్తకాన్ని ప్రచురించారు. సావర్కర్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతాన్ని ముస్లిం లీగ్ కూడా సమర్థించింది.

సావర్కర్ నుంచి పొందిన స్ఫూర్తితో 1925లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఏర్పాటైంది. నిజానికి ఈ ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రచారం చేసిందే హిందూ జాతీయ వాదులైన సావర్కర్, ఆర్‌ఎస్‌ఎస్ రెండో సర్ సంఘ్‌చాలక్ గోల్వాల్కర్. Bunch of Thoughts శీర్షికన రాసిన తన పుస్తకంలో.. 'ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు భారతదేశానికి అంతర్గత ముప్పు' అని గోల్వాల్కర్ అన్నారు. వారిని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఒకవైపు హిందూ జాతీయవాదులు, మరోవైపు ముస్లిం జాతీయవాదులు ద్విజాతి సిద్ధాంతం పేరుతో ప్రజల మధ్య ఐక్యతను ఎంత దెబ్బతీయాలో అంత దెబ్బతీశారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో మత కలహాలు చెలరేగడానికి కారణమయ్యారు. తిలక్ అనంతరం జాతీయోద్యమానికి నాయకత్వం వహించిన గాంధీ రెండు వర్గాలను సమన్వయపరుస్తూ జాతీయోద్యమాన్ని నడపసాగారు. చాలా కాలం వరకు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌తో కలిసి నడిచిన ముహమ్మద్ అలీ జిన్నా 1940 నాటికి ముస్లిం లీగ్‌లో చేరి ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలని కోరడం ప్రారంభించారు. ఇట్లా 1857 తర్వాత బ్రిటిష్ వారి విభజించి పాలించు కుట్రల కారణంగా హిందూ, ముస్లిం వర్గాల మధ్య ఐక్యత లోపించింది. ఇందుకు హిందూ, ముస్లిం జాతీయవాదులు ఇద్దరూ కారణమే.

**1947కు ముందు బీజేపీ లేదు కదా మరి దేశాన్ని హిందూ ముస్లిం పేరుతో రెండుగా విభజించింది ఎవరు? అని ప్రశ్నిస్తున్నారు మోదీ భక్తులు. ఈ పేరుతో లేకపోవచ్చు. కానీ, హిందూ మహాసభ పేరుతో, ఆర్‌ఎస్‌ఎస్ పేరుతో ఉన్నది. 1951లో భారతీయ జన్‌సంఘ్ ఆవిర్భవించింది. అవే ఈ నాటి బీజేపీకి పూర్వ రూపాలు. స్వాతంత్ర్యం కోసం జరిగిన జాతీయోద్యమంలో ఏ పాత్ర పోషించకపోయినా ద్విజాతి సిద్ధాంతంతో దేశ విభజనకు తోడ్పాటు అందించింది ఈ మతతత్వ శక్తులే. దేశ విభజనను బతికున్నంత కాలం వ్యతిరేకించింది మహాత్మాగాంధీ మాత్రమే. అందుకు ఆయనను హత్య చేసింది ఈ మతతత్వ శక్తులే. ఆయనను హత్య చేసింది ఎవరో అందరికీ తెలిసిందే.**

మన చరిత్ర ఏమిటో తెలియకపోతే మనం ఎక్కడికి పోవాలో గమ్యం అర్థం కాదు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన లౌకిక, ప్రజాస్వామిక, సోషలిస్ట్ విలువలు ధ్వంసం కాకుండా కాపాడుకోవాల్సింది ఈ దేశ ప్రజలే. ఈ దేశంలో మతతత్వ ఫాసిజం ప్రబలకుండా చూడాల్సింది ఇప్పటి తరమే. దేశ ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొట్టే అన్ని రకాల మతతత్వాలను వ్యతిరేకించాల్సిందే. వారిని భారత రాజకీయ రంగం నుంచి నిర్మూలించాల్సిందే. అప్పుడే భారత రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టిన వాళ్లమవుతాం. మతతత్వం మన సంస్కృతి కాదు. శతాబ్దాలుగా దేశం సంతరించుకున్న ఈ విలువలు ఇవ్వాళ విచ్ఛిన్నం అవుతున్నాయి. వీటిని కాపాడుకోవడం, సమున్నతంగా నిలబెట్టుకోవడం కాలం మన ముందు నిలిపిన సవాల్. దేశంలో ఉన్న గంగా జమునా తెహజీబ్ సంస్కృతి నాశనం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలదే.



# ప్రాజెక్టులకు మరమ్మతులొద్దా?




భోజన్నగారి అనసూయ

**ఇం**టిమీద పెంకులనే ఏడాదికోసారి సర్దుతాం. వ్యవసాయ బావి కూరుకుపోతున్నకొద్దీ పూడిక తీస్తూనే ఉంటాం. ఇంట్లో ఉన్న బోరు మోటరు పాడైతే మరమ్మతులు చేస్తూనే ఉంటాం. అంతెందుకు మనిషి కూడా రోగాల బారిన పడితే ఆ రోగం నయమయ్యేదాన్క దవాఖానల సుట్టూ తిరుగుతూనే ఉంటాడు. ఇట్లా మనిషైనా, వస్తువైనా మరమ్మతులు చేయాల్సిందే. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని గాలికొదిలేసి ప్రజలను నట్టేట ముంచుతున్నది. అసలు కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల మీద ప్రభుత్వానికి ఎందుకింత కినుక? 'అమ్మ పెట్టదు, అడుక్కు తిననీయదు' అన్నట్టు ఉన్నది కాంగ్రెస్ వ్యవహారం.

తెలంగాణలో కొలువుదీరిన కొత్త సర్కార్ గత ప్రభుత్వం చేసిన అన్నీ పనులను దండుగ అని విష ప్రచారం చేస్తున్నది. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి దేశాన్ని ఎక్కువకాలం పాలించింది కాంగ్రెస్ పార్టీనే. అలాంటి కాంగ్రెస్‌కు పథకాలు, పనులు, నిర్వహణ, మరమ్మతులు.. ఇలా అన్ని కలిస్తేనే పాలన అన్న చిన్న విషయం తెలియకపోవడం విడ్డూరం. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఎట్లా ఉందంటే.. 'ఎత్తుకుంటే చంకకురాడు, దింపితే నడువడు' అన్న చందంగా ఉన్నది. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన పాలన అందివ్వాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజల బాగోగులను గాలికొదిలేసి చోద్యం చూస్తుండటం గర్హనీయం.

అయితే ప్రభుత్వానికి తెలియాలి, లేకుంటే ప్రతిపక్షాలు చెప్తే వినాలి. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండింటిలో ఒక్కటి కూడా చేయడం లేదు. కొన్ని పార్టీలు పాలకపక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రగతికి అడ్డం పడుతుంటాయి. కాంగ్రెస్ పార్టీ కూడా అటువంటిదే. తెలంగాణ ప్రజలు అభిమానధనులే కాదు, గొప్ప ఆలోచనాపరులు కూడా. మన క్షేమ కాంక్షులెవరు? మాయమాటలు చెప్పేదెవరు? అనేది వాళ్లకు తెలుసు. తమ ఓటును సద్వినియోగపర్చుకుంటారు. రేపు జరుగబోయేది కూడా అదే.




తెలంగాణ ప్రజలకు 'కేసీఆర్' అంటే ఒక భావోద్వేగం. స్వరాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన మలిదశ ఉద్యమ పోరాటం, తెలంగాణ పునర్నిర్మాణం కోసం కేసీఆర్ చేసిన అభివృద్ధే అందుకు తార్కాణం. అయితే గతేడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ స్వల్ప తేడాతో అధికారం కోల్పోయినప్పటికీ, ప్రజలు అనతికాలంలోనే మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. అందుకు రెండు కారణాలున్నాయి. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ తన పదేండ్ల పాలనా కాలంలో రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా నిలపడం ఒకటైతే, 'మార్పు' పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనాతీరుపై రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే ఏవగింపు రావడం రెండవది.

# కేసీఆర్.. ఒక భావోద్వేగం




పిన్నింటి విజయ్‌కుమార్
90520 39109

**100** రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామని అబద్ధపు పునాదుల మీద కాంగ్రెస్ రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టింది. వచ్చీరాగానే ఆ పార్టీ ప్రజలను మోసానికి గురిచేయడం ప్రారంభించింది. అంతేకాదు, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అలా మొదలైందో లేదో రాష్ట్ర వ్యాప్తంగా తాగు, సాగు నీటికి కొరత ఏర్పడింది. కేసీఆర్ పాలనలో క్షణం కూడా కరెంటు పోకుంటే కాంగ్రెస్ పాలనలో గంటల పాటు కరెంటు కోతలు మొదలయ్యాయి. పదేండ్ల కేసీఆర్ హయంలో పలు సంక్షేమ కార్యక్రమాలు అమలైతే, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించకుండా కేసీఆర్ మార్క్ పాలనను చెరిపివేసే కుట్రలు మొదలుపెట్టింది. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తే పోయేవికావని గ్రహించిన ప్రజలు కాంగ్రెస్ కుటిల పన్నాగాలపై కోపోద్రిక్తులవుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి తర్వాత కేసీఆర్ కుంగిపోలేదు. తెలంగాణ ప్రజలు తమకు అప్పజెప్పిన బాధ్యతాయుతమైన ప్రతిపక్షపు హోదాను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఎప్పటికప్పుడు గుర్తుచేస్తూనే మరోసారి ప్రజానాయకుడు అనిపించుకుంటున్నారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కేసీఆర్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన బస్సుయాత్రకు.. ఏమరుపాటులో జరిగిన బీఆర్‌ఎస్ ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న ప్రజలు తండోపతండాలుగా కదిలివస్తున్నారు. ఊరూరా ఆయనకు గుమ్మడికాయలతో దిష్టితీస్తూనే పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్నారు. అశేష జనవాహిని రాకతో 'కేసీఆర్ అంటేనే తెలంగాణ, తెలంగాణ అంటేనే కేసీఆర్' అని బస్సుయాత్ర మరోసారి రుజువు చేస్తున్నది.

మలిదశ ఉద్యమంలో తెలంగాణ సకల జనుల మదిని దోచిన కేసీఆర్ నేడు ప్రతిపక్ష నాయకుడిగానూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం చేస్తున్న నేటి కేసీఆర్‌ను చూస్తుంటే నాటి ఉద్యమ కేసీఆర్ గుర్తొస్తున్నారని ప్రజలు ఆయనకు పిడికిలెత్తి జై కొడుతున్నారు. కష్టపడి కట్టుకున్న పక్షిగూడులో రాబందులు వాలినట్టు.. తెలంగాణ పునర్నిర్మాణం సాఫీగా జరుగుతున్న వేళ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ పార్టీ. ప్రజలు అప్పగించిన బాధ్యతాయుత అధికారాన్ని అపహాస్యం చేస్తున్నారు కాంగ్రెస్ నాయకులు. దేశాన్ని పదేండ్ల పాటు నిరవధికంగా పాలించిన బీజేపీ తెలంగాణ పట్ల ఎప్పుడూ సవతి తల్లిప్రేమనే చూపించింది. తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయడమే కాకుండా తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని తెలంగాణ ఏర్పాటు పట్ల విషం చిమ్మింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం. మే 13న రాష్ట్రంలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో ఈ రెండు జాతీయ పార్టీలకు తెలంగాణ ప్రజలు సరైన రీతిలో బుద్ధి చెప్పాలని బస్సు యాత్రలో కేసీఆర్ పిలుపునిస్తుంటే ప్రజలు తమ కరతాళ ధ్వనులతో జవాబు చెప్తుండటం ముదావహం.



పలు ఉద్యమ పద్ధతులను అవలంబించి ముందుకుసాగిన కేసీఆర్ ఓటమి ఎరుగని మహానేత. మలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కేసీఆర్ ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడకుంటా ఎన్నో శక్తులు అడ్డుకున్నాయి. అంతమాత్రాన తెలంగాణ రాకుండా ఉండలేదు కదా? అచ్చం అలాగే పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్‌ను చూసి కొన్ని శక్తులు ఓర్చుకోలేకపోయాయి. అందుకే కేసీఆర్‌పై అవాకులు చెవాకులు పేలారు. ప్రజలను తప్పుదోవ పట్టించడంలో విజయం సాధించారు. కానీ, ఇప్పుడు ప్రజలు నిజానిజాలు గ్రహిస్తున్నారు. అభివృద్ధి అంటే ఏమిటో, అబద్ధపు హామీలు అంటే ఏంటివో ప్రజలకు అనుభవంలోకి వచ్చింది. ప్రజలను మోసం చేస్తుంటే చూస్తూ ఊరుకునే మనిషి కాదు కేసీఆర్. అందుకే ఏడు పదుల వయస్సు, అందులో అనారోగ్యం.. అయినా పోరాటంలో కేసీఆర్ వెనక్కి తగ్గడం లేదు. తెలంగాణ ప్రజల బాగోగుల కోసం ఊతకర్రతోనూ ఉద్యమం చేస్తానంటూ ఆయన బస్సుయాత్ర చేస్తున్నారు. ఈ యాత్రలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికిపోయినా కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం తెలంగాణకు శుభ సూచకం.

*(వ్యాసకర్త: బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి నాయకుడు, కేయూ)*